ఈనాడు మంచిర్యాల
శుక్రవారం సెప్టెంబరు 27, 2024 7

ఘనంగా ఐలమ్మ జయంతి


ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతీలాల్

ఏసీసీ, న్యూస్‌టుడే: తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ కుమార్ దీపక్ జిల్లా అధికారులు, రజక సంఘం నాయకులతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ మోతీలాల్, బీసీ సంక్షేమశాఖాధికారి వినోద్‌కుమార్, రజకసంఘం నాయకులు తంగళ్లపెల్లి బాపు, వెంకటేశం, రంగురాజేశం తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలని నిరసన

ఏసీసీ, న్యూస్‌టుడే: నాలుగేళ్లుగా పెండింగ్‌లోని విద్యార్థుల ఫీజు బకాయిలు, ఉపకార వేతనాలను ప్రభుత్వం విడుదల చేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయం ముందు విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. యూఎస్‌ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న యూఎస్‌ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

అటకెక్కిన ఆహార పట్టిక!


చక్కని విద్యతోపాటు కడుపు నిండా భోజనం అందుతుందనే ఉద్దేశంతో తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చేర్చుతుంటారు తల్లిదండ్రులు. అయితే ఆహార పట్టిక సరిగ్గా అమలుకాక పిల్లల చదువుపై ప్రభావం పడుతోంది. గుత్తేదారులు సరకులు సక్రమంగా సరఫరా చేయకపోవడమే కారణం. ఉమ్మడి జిల్లాలోని గిరిజన వసతిగృహాల్లో ఈ సమస్య ఉత్పన్నమవుతోంది.

- వసతిగృహాలకు సరఫరా కాని సరకులు
- విద్యార్థులకు అందని పోషకాహారం

ఈనాడు, ఆసిఫాబాద్

గిరిజన వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఆహార పట్టిక ప్రకారం గుడ్లు, పాలు, చికెన్, రాగిజావ, అరటి పండ్లు అందించాలి. వీటి కోసం ఏటా టెండర్లు నిర్వహిస్తారు. గుత్తేదారులు బిల్లులు రావడం లేదంటూ చేతులెత్తేస్తున్నారు. రాకపోతే సంబంధిత ప్రధానోపాధ్యాయులే (హెచ్‌ఎం) సరకులు సమకూర్చుకోవాలని అధికారులు చెబుతున్నా.. ఆర్థిక భారమని వీరూ పట్టించుకోవడం లేదు. విద్యార్థులకు కేవలం పప్పు లేదా ఒక కూరతో సరిపెడుతున్నారు. కొన్ని వసతిగృహాల్లో అంతంతమాత్రంగానే మెనూ అమలవుతోంది. పెండింగ్ బిల్లులు విడుదల చేసి, విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


వాంకిడి గిరిజన వసతిగృహంలో భోజనం చేస్తున్న విద్యార్థులు



తెచ్చి పెడుతున్నా నిత్యం రూ.10-20 వేలు ఖర్చు పెట్టలేకపోతున్నామని వాపోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు జిల్లాల పరిధిలో రూ.1.50 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. పదుల సంఖ్యలో వసతిగృహాలకు నాలుగు నెలల నుంచి వీటి సరఫరా ఊసేలేకపోవడం గిరిజన సంక్షేమాధికారుల పనితీరును తేటతెల్లం చేస్తోంది.

పప్పన్నంతో సరి

విద్యార్థులకు నిత్యం ఉదయం పాలు, రాగిమాల్ట్ ఇవ్వాలి. వారంలో నాలుగు రోజులు గుడ్లు, నాలుగు రోజులు అరటిపండ్లు, ఒకసారి చికెన్ వండి పెట్టాల్సి ఉంటుంది. నిత్యం వివిధ కూరగాయలతో చేసిన కూర, పప్పు, అన్నం అందించాలి. ఉమ్మడి జిల్లాలో ఆహార పట్టిక (మెనూ) ఎక్కడా అమలు కావడం లేదు. కేవలం పప్పు, అన్నంతోనే విద్యార్థులు సరిపెట్టుకుంటున్నారు.



పప్పుతోనే విద్యార్థులకు భోజనం

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 530 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ కోడిగుడ్ల సరఫరా లేక పప్పుతోనే సరిపెడుతున్నారు. మండలంలోని అన్ని ఆశ్రమ పాఠశాలలకు గుడ్లు, అరటిపండ్లు రావడం లేదు.

ఏళ్లుగా ఇద్దరికే టెండర్!

ఏటా విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత ఐటీడీఏ అధికారులు సరకుల సరఫరా కోసం టెండర్లు నిర్వహిస్తుంటారు. కొన్నేళ్లుగా ఆదిలాబాద్, ఉట్నూరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తులకు మాత్రమే టెండర్ వస్తుండటం గమనార్హం. అంతర్జాలంలో అంతా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని అధికారులు చెబుతున్నా.. ఏళ్ల తరబడి వీరిద్దరికే ఎలా టెండర్ దక్కుతుందనేది అంతుపట్టని విషయం. పోనీ సరకులు సక్రమంగా సరఫరా చేస్తారా అంటే అదీ ఉండటం లేదు. మరోవైపు కొత్తవారు టెండర్లు వేయకుండా, వారికి అవకాశం రాకుండా చేస్తున్నారనే ఆరోపణలు సైతం వ్యక్తమవుతున్నాయి.

రూ.1.50 కోట్ల బిల్లుల పెండింగ్!

జూన్ నుంచి కొంత కాలంపాటు పాలు, చికెన్, గుడ్లు, అరటిపండ్లు సరఫరా చేసిన గుత్తేదారులు.. నెల రోజుల నుంచి అనేక వసతిగృహాలకు అందించడం లేదని సమాచారం. కొన్నిచోట్ల ప్రధానోపాధ్యాయులు

పర్యవేక్షిస్తాం - రమాదేవి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి

గుత్తేదారులు సరకులు సరఫరా చేయలేకపోతే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే వీటిని తెప్పించాలి. వీరికి బిల్లులు చెల్లిస్తాం. ఆహారపట్టిక తప్పనిసరిగా గిరిజన ఆశ్రమ వసతిగృహాల్లో అమలు చేసేలా పర్యవేక్షిస్తాం.


లోతు వాగు ప్రవాహం దాటలేక ఇరువైపులా ఎదురు చూస్తున్న నాలుగు గ్రామాల ప్రజలు

లోతు వాగు కష్టం తీరేదెప్పుడో?


మండలంలోని నక్కలపల్లితోపాటు బ్రాహ్మణపల్లి, వేమనపల్లి మండలంలోని చామనపల్లి, బద్దెంపల్లి గ్రామాలకు రాకపోకలకు ఏకైక దారి ఇదే కావడంతో మధ్యలోని వాగులు ఆయా గ్రామాల అభివృద్ధితోపాటు ప్రజల రాకపోకలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఇటీవల గొర్రెగట్టు వాగుపై వంతెన పూర్తి కావడం కొంత ఉపశమనం కలిగించినప్పటికీ లోతువాగు వద్ద నిత్యం రాకపోకలు స్తంభించిపోతుండటం సమస్యగా మారుతోంది. ఇదివరకు ఈ వాగుపై కాజ్‌వే ఉండటంతో ప్రవాహం తగ్గుముఖం పట్టిన తర్వాత రాకపోకలు సాగించేవారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాజ్‌వే నామరూపాల్లేకుండా వరదలకు కొట్టుకుపోవడంతో కాలినడకన సైతం రాకపోకలు సాగించలేని విధంగా మారింది. నాలుగు రోజుల క్రితం గ్రామస్థులు కంకరతో తాత్కాలిక మరమ్మతులు చేసుకొని వాహనాల రాకపోకలకు కొంత ఏర్పాటు చేసుకున్నప్పటికీ అదే రోజు సాయంత్రం మరోసారి వాగు ఉప్పొంగడంతో పరిస్థితి యథావిధిగా మారింది. **- న్యూస్‌టుడే కోటపల్లి**

కేంద్రీయ విద్యాలయ పనులు వేగవంతం చేయండి

ఏసీసీ, హాజీపూర్ న్యూస్‌టుడే: కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. హాజీపూర్‌లో నిర్మిస్తున్న నూతన భవనాన్ని ప్రిన్సిపల్ ప్రసాద్‌తో కలిసి గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

జనరల్ సర్జన్ వైద్యులు.. ఫిజీషియన్ సేవలు

బెల్లంపల్లి చౌరస్తా, ప్రయాణ ప్రాంగణం, ఐబీ ప్రాంతాల్లోని పలు ప్రైవేటు ఆసుపత్రులు జనరల్ సర్జన్ సేవలకే పరిమితం. కానీ ఆయా వైద్యులు సాధారణ జ్వర బాధితులను పరీక్షిస్తున్నారు. జనరల్ మెడిసిన్ వైద్యులు చేయాల్సిన చికిత్స వీరు చేస్తూ మోతాదుకు మించి యాంటీబయాటిక్స్ సూది మందు ఇస్తున్నారు. సంబంధిత ఓ వైద్యుడు ఇదే తీరుతో ఇటీవల ఓ యువకుడి మృతికి పరోక్షంగా కారణమయ్యారు. ఇలాంటి వారిపై ఆరోగ్యశాఖ చర్యలు శూన్యం అయ్యాయి.



ఇది శుభపరిణామం

ఈ సూచికలు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలోనివి. ఇలా ప్రతీ సాధారణ, మల్టీ, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచాలి. ఒకటి రెండు చోట్ల తప్పితే ఎక్కడా ఏర్పాటు చేయడం లేదు. తనిఖీల పేరుతో ఆరోగ్యశాఖకు చెందిన ఒకరిద్దరు అధికారులు వసూళ్లబాట పడుతున్నారు తప్పితే ప్రజల ఆరోగ్యానికి ఏ మాత్రం భరోసా ఇవ్వడం లేదనే ఆరోపణలున్నాయి. కొంతమంది యువ వైద్యులు ఆర్‌ఎంపీ, పీఎంపీలను ప్రోత్సహించం అంటూ బహిరంగంగా సూచిక ఏర్పాటు చేసుకోవడం బాధితులకు శుభపరిణామం.

తనిఖీలకే పరిమితం..
చర్యలు శూన్యం!

- జిల్లా ఆరోగ్యశాఖ పనితీరిది

మంచిర్యాల వైద్యవిభాగం, న్యూస్‌టుడే

జిల్లాలో ఆర్‌ఎంపీలు, వైద్యులు సౌకర్యాలు లేకుండా నిర్వహిస్తున్న ఆసుపత్రులపై టీజీఎంసీ(తెలంగాణ మెడికల్ కౌన్సిల్) ఆకస్మిక దాడులు నిర్వహిస్తోంది. మరోవైపు జిల్లా వైద్యారోగ్యశాఖ ఏడాదికి ఒకసారి అధికారి మారినప్పుడల్లా తనిఖీలు చేపడుతోంది. నిర్వహించిన ప్రతీ సారి చాలా ఆసుపత్రుల్లో తగిన సదుపాయాలు అందుబాటులో లేవని గుర్తిస్తున్నారు. కానీ ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు శూన్యం. దీంతో ప్రైవేటు ఆసుపత్రుల ఆగడాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ సంవత్సరం సైతం నూతన వైద్యాధికారి రావడంతో మళ్లీ తనిఖీలు మొదలుపెట్టారు. అయిదు


ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పత్రాలు తనిఖీ చేస్తున్న ఆరోగ్యశాఖ అధికారులు

బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహిస్తున్నారు. పక్షం రోజులకుపైగా ఈ తనిఖీలు జరుగుతాయని తెలుస్తోంది. మరి ఈ సారైనా చర్యలు ఉంటాయా.. లేదా అనేది త్వరలో తేలనుంది.

అనుమతులపై ఆరా..

ఈ ఏడాది తనిఖీలు చేస్తున్న పీఓ (ప్రోగ్రాం అధికారి)లలో ఒకరు తప్ప అందరూ నూతనంగా బాధ్యతలు తీసుకున్నవారే. పైగా కొత్తగా నియామకమైన వారికి నిజాయతీ అధికారులుగా గుర్తింపు సైతం ఉంది. గతంలోనూ ఇలాంటి తనిఖీలు చేసినా ఆరోగ్యశాఖ ఇప్పటి వరకు ఏ ఒక్క ఆసుపత్రిపై చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది. ప్రస్తుత బృందాలు కాస్త కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. చేపట్టిన ఈ తనిఖీల్లో ఆసుపత్రుల బండారం బయటపడుతున్నట్లు సమాచారం వస్తోంది. ఆసుపత్రి అనుమతి, అందుబాటులో ఉన్న వైద్యులు, అనుమతి పత్రాలపై ఉన్నవారి పేర్లు వేరుగా ఉన్నాయని, మల్టీస్పెషాలిటీ పేరుతో ఎంబీబీఎస్ వైద్యులతో నెట్టుకొస్తున్నట్లు తనిఖీ అధికారుల నుంచి సమాచారం వస్తోంది. నిపుణులు లేకుండా ఫార్మసీ, ల్యాబ్ నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. ధరల పట్టిక, అందుబాటులో ఉన్న, విజిటింగ్ వైద్యుల పేర్లు కూడా సూచికల్లో రాయడం లేదని సమాచారం.

గుర్తించడం వరకే వీరి పని..

ప్రస్తుత వైద్య బృందాలు తనిఖీలు చేపడుతున్నా సమస్యలు గుర్తించడం వరకే వీరి పని అని తెలుస్తోంది. ఆయా ఇబ్బందుల వివరాలను ఆరోగ్యశాఖ అధికారికి సూచించడం తప్పితే ఆసుపత్రులపై చర్యలు తీసుకునే అధికారం అంతిమంగా జిల్లా వైద్యాధికారిదే. గతంతోపాటు ఇప్పుడు కూడా నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్న ఆసుపత్రుల బండారం బయటపడుతున్నా చర్యలు శూన్యమని, తమ తనిఖీలు ఒకరిద్దరి జేబులు నింపేందుకు ఉపయోగపడుతున్నాయని ఈ బృందంలోని కొంతమంది సిబ్బంది చెబుతుండటం విశేషం.

పురపాలికలో అవినీతి!



- తాజాగా రూ.9.67 లక్షలు స్వాహా చేసిన ఎన్ఎంఆర్ ఉద్యోగి

◆ మంచిర్యాలలో మున్సిపల్ బిల్ కలెక్టర్‌గా పని చేస్తున్న ఓ ఉద్యోగి హ్యాండ్ మిషన్ ద్వారా వసూలు చేసిన దాదాపు రూ.1.80 లక్షలు స్వాహా చేశారని తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న అధికారులు తిరిగి అతడితో ఆ డబ్బులు పురపాలక సంఘానికి కట్టించారు.

◆ సీఎస్‌సీ ఆన్‌లైన్ (సిటిజన్ సర్వీస్ సెంటర్) ద్వారా వివిధ పన్నులు స్వీకరించిన కంప్యూటర్ ఆపరేటర్లు దాదాపు రూ.3.85 లక్షలు స్వాహా చేయగా తిరిగి ఆ డబ్బులను అధికారులు వసూలు చేసినట్లు తెలిసింది.

◆ నాలుగేళ్ల కిందట ఇంజినీరింగ్ విభాగంలో పని చేసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి నరేష్ రెండో రసీదు పుస్తకం ద్వారా ఆస్తి పన్ను వసూలు చేసి దాదాపు రూ.3.40 లక్షలు స్వాహా చేసినట్లు తెలిసింది. అందులో కొంత మేర మున్సిపల్ అధికారులు రాబట్టి అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు.

◆ ఇలా మరికొందరు ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగాల్లో పని చేసిన ఉద్యోగులు రసీదు పుస్తకాల సమయంలో పన్నులు వసూలు చేసి స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో కొందరు డబ్బులు తిరిగి చెల్లించగా, మరికొందరు ఇప్పటికీ చెల్లించలేదని తెలిసింది.

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే

మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో పని చేసే ఉద్యోగులు అయిదేళ్లుగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆస్తి పన్నులు, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్, తదితర పన్నులు వసూలు చేసిన కొంతమంది ఉద్యోగులు ఆ డబ్బును బ్యాంకులోని మున్సిపాలిటీ ఖాతాలో జమ చేయకుండా సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. మున్సిపల్ పాలకవర్గం సభ్యులు, అధికారుల అండదండలతో ఉద్యోగులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.


మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం

తాజాగా పురపాలక సంఘంలో క్యాషియర్ ఇన్‌ఛార్జిగా పని చేసే ఎన్ఎంఆర్(నామినల్ మాస్టర్ రోల్) ఉద్యోగి నర్సింగారావు రూ.9.67 లక్షలు స్వాహా చేశారు. ఈ విషయం బయటకు పొక్కకుండా అధికారులు జాగ్రత్తపడి అతడిని క్యాషియర్ ఇన్‌ఛార్జి బాధ్యతలు తప్పించి మొక్కలు పెంపకం పర్యవేక్షించే పని అప్పగించారు. ఆ స్వాహా చేసిన సొమ్మును పురపాలక సంఘానికి చెల్లించాలని నర్సింగరావుపై అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. ఏడాది కిందట ఇక్కడ పని చేసిన యాకుబ్ అనే బిల్ కలెక్టర్ సాధారణ బదిలీపై వేరే పురపాలక సంఘానికి వెళ్లినప్పుడు అతడి వద్ద ఉన్న బిల్లింగ్ హ్యాండ్ మిషన్‌ను, ఇన్‌ఛార్జి క్యాషియర్‌గా పని చేస్తున్న నర్సింగరావుకు అప్పగించినట్లు తెలిసింది. ఆ బిల్లింగ్ మిషన్ మరో బిల్ కలెక్టర్‌కు అప్పగించకుండా తానే ప్రజల నుంచి పన్నులు తీసుకుంటూ ఆ డబ్బులను పురపాలక సంఘానికి చెల్లించకుండా సొంత అవసరాలకు వాడుకున్నాడు.

◆ పురపాలక సంఘాల్లో ప్రజల నుంచి ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్ రుసుంలాంటి వివిధ పన్నులు వసూలు చేసి రసీదులు ఇచ్చేవారు. ఆ పుస్తకాలు ఉన్నప్పుడు ఉద్యోగులు ప్రజల నుంచి పన్నులు వసూలు చేసి మున్సిపాలిటీకి చెల్లించకుండా అక్రమాలకు పాల్పడుతున్నారనే ఉద్దేశంతో ప్రభుత్వం 'బిల్లింగ్ హ్యాండ్ మిషన్లు' బిల్లు కలెక్టర్లకు ఇచ్చి పన్నులు వసూలు చేయిస్తోంది. మరికొన్ని పన్నులను సీఎస్‌సీ ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్లు ఆపరేటర్లు సేకరిస్తున్నారు. అయినా బిల్లింగ్ హ్యాండ్ మిషన్లు, సీఎస్‌సీ ఆన్‌లైన్ ద్వారా చెల్లించే పన్నులను కూడా మంచిర్యాల మున్సిపల్ ఉద్యోగులు స్వాహా చేశారు.

డబ్బులు తిరిగి కట్టించాం

-మారుతీ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్, మంచిర్యాల పురపాలక సంఘం

మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి క్యాషియర్ నర్సింగరావు అక్రమంగా వాడుకున్న డబ్బులను తిరిగి అతడితో పురపాలక సంఘానికి కట్టించాం. అతడిని క్యాషియర్ బాధ్యతల నుంచి తప్పించి మరో జూనియర్ అసిస్టెంట్‌కు అప్పగించాం. అతనికి ఆ సెక్షన్‌పై అవగాహన కల్పించడానికి వారం రోజులు నర్సింగరావు అక్కడ తాత్కాలికంగా పని చేయాలని చెప్పాం. ఆ తర్వాత అతడిని పట్టణంలో నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతలు అప్పగిస్తాం. పురపాలక సంఘంలో లావాదేవీలన్నీ ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్నాయి. అందులో అవినీతికి పాల్పడితే నెల రోజుల్లోనే దొరికిపోతారు. డబ్బులు అక్రమంగా వాడుకున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

రేపు పాలనాధికారి కార్యాలయం వద్ద ధర్నా

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని 28న జిల్లా పాలనాధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. భూపాల్, వంగూరి రాములు, దుంపల రంజిత్‌కుమార్, దాసరి రాజేశ్వరి పాల్గొన్నారు.

నూతన ఇసుక రీచ్‌లను గుర్తించండి

ఏసీసీ, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌లను వర్షాల కారణంగా నిలిపి వేసినట్లు కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. ప్రజల అవసరాల మేరకు ఇసుక సరఫరాకు నూతన రీచ్‌లను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మైనింగ్, పంచాయతీ శాఖాధికారులను ఈ మేరకు ఆదేశించారు. మైనింగ్ ఏడీ జగన్‌మోహన్‌రెడ్డి, పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగించిన గుర్తు తెలియని వ్యక్తులు!

- చికిత్స పొందుతూ యువకుడి దుర్మరణం


కుష్ణపల్లి అంజన్న

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బలవంతంగా గుర్తు తెలియని వ్యక్తులు ఓ యువకుడికి పురుగు మందు తాగించగా అతడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై ఉదయ కిరణ్ వివరాల ప్రకారం దండేపల్లి మండలం రెబ్బన్‌పల్లి గ్రామానికి చెందిన కుష్ణపల్లి అంజన్న(20) మంచిర్యాల ప్రభుత్వ కళాశాలలో ఎంఎల్‌టీ కోర్సు చదువుతున్నాడు. ప్రతి రోజు గ్రామం నుంచి వచ్చి పోతుంటాడు. ఈ నెల 17న రోజులాగా కళాశాలకు వెళ్లాడు. సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ దొరకలేదు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మంచిర్యాలలో సీసీటీవీ ఫుటేజీ, చరవాణి లొకేషన్ పరిశీలించారు. 18న మందమర్రిలోని బంధువుల ఇంటిలో ఉన్నట్లు గుర్తించారు. ఏం జరిగిందని కుటుంబ సభ్యులు అడిగితే ఏం చెప్పలేదు. గురువారం గొంతు నొప్పిగా ఉందని చెప్పగా లక్షెట్టిపేట ఆసుపత్రిలో చూపించారు. మందులు వాడినా తగ్గకపోవడంతో శుక్రవారం మంచిర్యాల ఆసుపత్రికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో శనివారం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తనను అపహరించి నోట్లో ఏదో పోశారని చెప్పాడు. వైద్యులు పరీక్షలు నిర్వహించి పురుగు మందుగా నిర్ధారించారు. దీంతో కరీంనగర్ న్యాయమూర్తి ఆసుపత్రికి వచ్చి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. దండేపల్లి పోలీసులు సైతం అక్కడకు వెళ్లి విషయాలు తెలుసుకొని కేసు నమోదు చేశారు. అనంతరం అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు.

పల్లెలకు నిధులు

- ట్రాక్టర్ అప్పు కిస్తీలు, కార్మికుల వేతనాలు చెల్లింపునకు విడుదల


న్యూస్‌టుడే, నిర్మల్

ఇన్నాళ్లూ నిధుల లేమితో ట్రాక్టర్ కిస్తీలు, కరెంటు బిల్లులు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లింపులు లేక, పనులు సాగక పల్లెల్లో పాలన పడకేసింది. పాలకవర్గాలు లేకపోవడంతో ప్రత్యేక పాలన అస్తవ్యస్తంగా మారుతున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు వినిపించింది. ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి కాలువల్లో ఉన్న మురుగును ఎత్తిపారేస్తూ.. రోడ్లన్నీ శుభ్రం చేస్తూ.. ఇంటింటా చెత్తను సేకరిస్తూ.. మొక్కలను కంటికి రెప్పలా కాపాడుతూ పచ్చదనం కోసం పరితపిస్తున్న కార్మికులకు సకాలంలో వేతనాలు అందక ఆర్థికంగా పడుతున్న ఇబ్బందులు దూరం చేయడానికి, ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టడానికి నిధులు విడుదల చేసింది.

కార్యదర్శులపై భారం పడకుండా..

ఈ ఏడాది ఫిబ్రవరి 2 వరకు సర్పంచులు పాలకవర్గాలకు బాధ్యత వహించారు. పల్లెల్లో ఏ పని కావాలన్నా వారే ముందుగా ఖర్చు చేసి తర్వాత బిల్లులు డ్రా చేసుకునే వారు. వారి పదవీకాలం ముగిసిన తర్వాత ఆ భారం పంచాయతీ కార్యదర్శులపై పడింది. జిల్లాలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు సొంతంగా రూ.వేలల్లో ఖర్చు చేశారు. మరికొందరు వారి వేతనాలు విడుదల కాగానే అందులోంచి వెచ్చించారు కూడా. పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, కార్మికులకు వేతనాలు, ట్రాక్టర్ నిర్వహణ, డీజిల్ ఖర్చులు, నీటి ట్యాంకులకు సింగిల్‌ఫేస్ మోటార్లు అమర్చడం వంటి పనులు కార్యదర్శులే సొంతంగా ఖర్చు చేశారు. ఖాతాల్లో డబ్బులు లేకున్నా పాలనను ముందుకు నెట్టుకొస్తున్నా నిధులు విడుదల చేయడంలో


మురుగు కాలువలను శుభ్రం చేస్తున్న కార్మికులు



నిర్మల్	72	1,624	4.63
ఆదిలాబాద్	254	1,505	5.05
మంచిర్యాల	55	1,092	3.49
కుమురంభీం	50	1,203	3.34

■ ట్రాక్టర్ కిస్తీలు చెల్లించని పల్లెలు ■ పారిశుద్ధ్య కార్మికులు ■ విడుదలైన నిధులు (రూ.కోట్లలో)

జాప్యం చేయడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పంచాయతీ కార్యదర్శులు సైతం ఆవేదన చెందుతూ వచ్చారు. ఎట్టకేలకు ట్రాక్టర్ కిస్తీలకు, కరెంటు బిల్లులు, ఇతర అభివృద్ధి పనులు, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు విడుదల చేయడంలో కార్యదర్శులపై ఆర్థిక భారం నుంచి బయటపడ్డారు. అసలే వర్షాకాలం. . వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు మురుగు కాలువలు, రోడ్లు శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెలా వేతనాలు చెల్లించేలా చూడాలని కోరుతున్నారు.

అప్రమత్తతే.. పిడుగుపాటు నుంచి రక్షణ!

● ఇటీవల వరుస మరణాలు

పిడుగు అంటే..

వానలు పడే సమయంలో మబ్బుల నుంచి అత్యంత శక్తివంతమైన విద్యుత్తు విడుదల అవుతుంది. అది భూమికి చేరినపుడు దాన్ని పిడుగు అంటారు. ఆ సమయంలో భారీ ఉరుములు, మెరుపులు వస్తాయి. పిడుగుతో చనిపోయిన ప్రతి పది మందిలో ఆరుగురు చెట్ల కింద నిలబడిన వారే.

కెరమెరి, ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే:

ఏటా వానకాలంలో పిడుగుపాట్లకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో మనుషులు, జీవాలు మృత్యువాతపడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వానకాలం చివరి దశలో ఉన్న ఈ సమయంలో వరుస మరణాలు ఆందోళనకు కారణమవుతోంది. సాంకేతికత ఉపయోగించి ప్రజలకు ముఖ్యంగా రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరముంది. అడవుల జిల్లాగా పేరొందిన ఉమ్మడి ఆదిలాబాద్‌లో సాధారణంగా ఎత్తైన ప్రాంతాలు, చెట్లు ఎక్కువగా ఉండడంతో వర్షపాతం అధికంగా ఉంటుంది. దీనికితోడు పిడుగుల సమస్య కూడా ఎక్కువే.


ఇటీవల ఉమ్మడి జిల్లాలో జరిగిన ఘటనలు

కళ్లెదుటే భర్త మృత్యువాత

గత నెల 18న పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్ గ్రామానికి చెందిన సిడాం శ్రీనివాస్.. భార్య కాంత కూలీలతో వరి పొలంలో ఎరువులు వేస్తుండగా భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా పిడుగు పడటంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. కాంతకు స్వల్ప గాయాలయ్యాయి. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

- ఈ నెల 21న కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్‌లో ఎద్దుపై పిడుగుపడి మృతి చెందింది. సమీపంలో ఉన్న తాక్రె గోవింద, నీలాబాయి దంపతులు పిడుగుపాటుకు గురై గాయాలపాలయ్యారు.
- ఈ నెల 22న మంచిర్యాల జిల్లా తాండూరు మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన గోలెం పోషక్క తన వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తుండగా.. పిడుగుపడి మృతిచెందింది.
- ఈ నెల 22న అదిలాబాద్ జిల్లా బేల మండలం సిర్సన్న గ్రామానికి చెందిన రాఠోడ్ అవినాష్.. తన చేనులో పశువుల కోసం గడ్డి కోస్తుండగా పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

ముందుగా తెలుసుకోవడం ఎలా?



పిడుగుల నుంచి ముందే హెచ్చరించేందుకు కేంద్ర ప్రభుత్వం **'దామిని'** యాప్ అందుబాటులోకి తీసుకొచ్చింది. రానున్న 15 నిమిషాల్లో మనం ఉండే ప్రదేశంలో పిడుగు పడుతుందో లేదో దీని ద్వారా తెలుసుకోవచ్చు. కేంద్ర భూ విజ్ఞానశాఖ కింద పనిచేసే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ 2020లో ఈ యాప్ రూపొందించారు. వ్యక్తుల జీపీఎస్ లొకేషన్ ఆధారంగా 20-30 కి.మీ. పరిధిలో పిడుగుల నుంచి యాప్ ముందుగానే హెచ్చరిస్తుంది. ప్లేస్టోర్ ద్వారా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మోహన్‌దాస్ తెలిపారు.

ఈ జాగ్రత్తలు పాటిస్తే..



- పంట చేన్లలో పనిచేసే సమయంలో వర్షం పడితే రైతులు ఏదో ఒక చెట్టు కిందికి వెళ్తుంటారు. గాలి, ఉరుములు, మెరుపులు ఉంటే పిడుగులు పడేందుకు అవకాశం ఎక్కువ.



- సాధారణంగా ఎత్తైన ప్రాంతాల్లో లేదా చెట్లపై ఎక్కువగా పడే అవకాశం ఉండటంతో ఆయా ప్రాంతాల్లో ఉండకూడదు.
- కేబుల్ టీవీ, కంప్యూటర్లు వంటి విద్యుత్తు ఉపకరణాలు ఆపేసి కనెక్షన్లు తొలగించాలి.
- విద్యుత్తును గ్రహించే వస్తువులకు దూరంగా ఉండాలి. నేల మీద నిటారుగా నిల్చొని ఉండొద్దు. భూమిపై పడుకోవాలి లేదా కూర్చోవాలి.
- పిడుగుపాటుకు గురైన వ్యక్తి స్పృహ కోల్పోతాడు. ఇలాంటి వారికి ప్రాథమిక చికిత్స చేయడం కూడా కష్టం. బాధితులను వెంటనే ఆసుపత్రికి తరలించాలి
- ఈ సమయంలో చరవాణి వాడకూడదు.

నష్టపరిహారం ఉంది..




పిడుగుపాటుతో మృతి చెందితే కేంద్ర ప్రభుత్వం రూ.4 లక్షల నష్టపరిహారం ఇస్తుంది. గత భారాస ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ జీఓకు అదనంగా మరో రూ.2 లక్షలు కలిపి రూ.6 లక్షలు ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. రైతుబీమా పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఎవరైనా పిడుగుపాటుతో చనిపోతే దీని కింద రూ.5 లక్షలు మంజూరు చేశారు. కానీ భూములు లేని వారిని పట్టించుకోకపోవడంతో ఉమ్మడి జిల్లా మొత్తంలో ఇప్పటి వరకు 42 మందికి పైగా పిడుగుపాటుకు గురై మృతి చెందినా పరిహారం రాని పరిస్థితి. జీఓను సవరించి, కేంద్ర నుంచి వచ్చే పరిహారం కోసం ప్రయత్నిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు బి.గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

- సుమిత్ర బాయి, కెరమెరి



ఇద్దరు పిల్లలతో కనిపిస్తున్న ఈమె చౌదరి సుమిత్ర బాయి. భర్త చౌదరి రమేష్ ఆగస్టు 16న వ్యవసాయ పనులు చేస్తున్న క్రమంలో పిడుగుపాటుకు గురై మృత్యువాతపడ్డారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి ఇద్దరు చిన్నారులతో ఒంటరిగా మిగిలారు. ఎలాంటి వ్యవసాయ భూమి లేకపోవడంతో జీవితం అగమ్యగోచరంగా మారిందని వాపోతున్నారు.



పర్యాటకం.. మెరుగుపరిస్తే ప్రయోజనం

● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

న్యూస్‌టుడే, కడెం: సహజసిద్ధమైన అందాలతో ఆకట్టుకునే కడెం జలాశయానికి నాలుగేళ్లుగా సందర్శకుల తాకిడి ఎక్కువైంది. ఎత్తైన సహ్యాద్రి కొండలను ఆనుకుని కనువిందు చేసే సుందర దృశ్యాలను ఇముడ్చుకుని ఉన్న కడెం పర్యాటకులకు మానసికోల్లాసాన్ని అందిస్తుందనడంలో సందేహం లేదు. అయితే ఇక్కడకు వచ్చే పర్యాటకులకు సరైన సదుపాయాలు లేక, ప్రశాంత వాతావరణంలో కొద్దిసేపు సేద తీరుదామంటే వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. సందర్శకులు జలాశయంలో విహరించేందుకు పర్యాటకశాఖ ఏర్పాటు చేసిన పడవల్లో స్పీడ్ బోటు మోటారు చెడిపోవడంతో దాన్ని పక్కన పడేశారు. పెద్ద బోటులోకి ఎక్కేందుకు ఉపకరించే స్టాండు(జెట్టి) పక్కలకు రక్షణ లేక ప్రమాదకరంగా ఉంది. ఈ బోట్లను మార్చి కొత్త పడవలు, స్టాండు తెప్పిస్తామన్న అధికారులు, నేతల మాటలు కార్యరూపం దాల్చడం లేదు. జలాశయం నీటిలో పెద్దలు, పిల్లలకు కావల్సిన ఆట పరికరాలనూ ఏర్పాటు చేస్తే మేలనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

లీజుకు హరిత రిసార్టులు



మూసి ఉన్న హరిత రిసార్టు

కడెంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే హరిత రిసార్టులో ఉన్న విడిది గదుల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు సేద తీరేవారు. వచ్చిపోయే వారికి భోజనం అందించే అవకాశం ఉండేది. అయితే ఈ రిసార్టును బృందావన్ గార్డెన్స్ వారు ఇటీవల లీజుకు తీసుకున్నారు. దీనిని మెరుగుపరిచి మరింత చక్కటి ఆతిథ్యం ఇచ్చేలా హోటల్, విడిది గదులను తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించి పనులు చేపడుతున్నారు. కడెం వచ్చే సందర్శకులకు మానసిక ఉల్లాసాన్నిచ్చేలా రిసార్టును అభివృద్ధి చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు. అయితే రెండు నెలలుగా ఈ రిసార్టు మూసి ఉందని.. త్వరగా విడిది గదులను మెరుగుపరిచి అందుబాటులోకి తేవాలని పర్యాటకులు కోరుతున్నారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

నిర్మల్, న్యూస్‌టుడే: జిల్లాలో సంచలనం సృష్టించిన యూబిట్ కాయిన్ మల్టీలెవల్ మార్కెటింగ్‌లో పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశామని జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. కడెం మండలం కన్నాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు దాసరి రమేశ్, కుభీరు మండలం దౌజినాయక్ తండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కీరం వెంకటేశ్‌గౌడ్‌లను పోలీసుల రిమాండ్ నివేదిక ఆధారంగా సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇలాంటి వ్యవహారాలకు పాల్పడవద్దని హెచ్చరించారు.

కేంద్ర మంత్రులతో ఎంపీ, ఎమ్మెల్యేల భేటీ



కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమైన ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ దిల్లీలో గురువారం కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. ఆయా సమస్యలను ప్రస్తావించారు. తొలుత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి జిల్లా కేంద్రంలో ఎయిర్‌ఫోర్సు ఏర్పాటు గురించి విన్నవించారు. రక్షణ శాఖకు ఇక్కడ 369 ఎకరాల భూమి ఉందని, అదనంగా 1592 ఎకరాల సేకరణకు జిల్లా అధికారులు భూమిని గుర్తించారని వివరించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సహకరించేందుకు సిద్ధంగా ఉందని చెప్పడంతో త్వరలో పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారని ఎంపీ తెలిపారు. అనంతరం కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని కలిసి మూతపడ్డ సీసీఐను తెరిపించాలని విన్నవించినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనూ మంత్రి తమ ముందే మాట్లాడారన్నారు. త్వరలో కేంద్ర, రాష్ట్ర అధికారులతో ఉమ్మడి సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారని వెల్లడించారు. జాతీయ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ అంతర్‌సింగ్ ఆర్యను కలిసి ఇటీవల జరిగిన జైనూర్ ఘటన పూర్వాపరాలను వివరించినట్లు తెలిపారు. ఆదివాసీలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరినట్లు వివరించారు.

సిరికొండలో సామాజిక బహిష్కరణ

ఈటీవీ - ఆదిలాబాద్ : పగలు పట్టింపులు మానవత్వాన్ని మరిచిపోయేలా కుటుంబాన్ని సామాజికంగా బహిష్కరించిన ఘటన ఒకటి ఆలస్యంగా వెలుగు చూసింది. ఆదిలాబాద్ జిల్లా సిరికొండలో నివాసముండే దగ్గరి బంధువుల మధ్య ఒకప్పుడు ఎంతో సఖ్యత ఉండేది. అంతా దగ్గరి బంధువులే కావటంతో అవసరాల రీత్యా ఓ కుటుంబం రూ.2 లక్షలు అప్పు తీసుకొంది. తిరిగి చెల్లించడంలో జాప్యం కావటంతో మనస్పర్థలకు దారితీసింది. మాటామాటా పెరిగి కుటుంబాల మధ్య కలహానికి దారితీసింది. విషయం కుల పెద్దల పంచాయతీ వరకు వెళ్లింది. తీసుకున్న అప్పు తీర్చినా మనస్పర్థలు తొలగిపోలేదు. ఆలస్యంగా అప్పు చెల్లించిన కుటుంబాన్ని బహిష్కరించాలని సమీప బంధువులే నిర్ణయించారు. మిగిలిన బంధువులు కూడా వారి ఇంటికెళ్లొద్దని నిర్ణయించారు. బహిష్కరణకు గురైన బాధితుల కుటుంబంలో ఇటీవల ఓ పెద్దాయన కాలం చేశారు. సమీప బంధువులెవరూ రాలేదు. పాడెను ఎత్తుకోలేదు. మిగిలిన కుల, సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులు సహకరించి అంత్యక్రియలు పూర్తిచేశారు. బంధువులంతా ఉండి అనాథలయ్యామంటూ బాధితుల్లో ఒకరు కన్నీరుమున్నీరుగా విలపించారు.



ఉద్యమాల ఊపిరి.. కొండా లక్ష్మణ్ బాపూజీ

● నేడు జయంతి

న్యూస్‌టుడే, వాంకిడి

స్వాతంత్రోద్యమం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, తెలంగాణ విముక్తి పోరాటం.. మూడు దశల ఉద్యమాల్లో పిడికిలెత్తి ప్రముఖ పాత్ర పోషించి దేశసేవకు అంకితమైన అలుపెరగని వీరుడు కొండాలక్ష్మణ్ బాపూజీ. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ లక్ష్యం చేరుకున్న సమయంలో దశాబ్దాల కల సాకారమైన వేళ స్వప్నాన్ని కళ్లారా చూడలేకపోయారు. ఓవైపు ఉద్యమాలే కాకుండా ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసి ప్రజాసేవలో రాణించారు. నేడు ఆయన జయంతి సందర్భంగా ప్రత్యేకం కథనం.

కుమురం భీం జిల్లా వాంకిడి మండల కేంద్రంలో 1915 సెప్టెంబరు 27న అమ్మక్క-బాపూజీలకు నాలుగో సంతానంగా కొండా లక్ష్మణ్ జన్మించారు. న్యాయవాద విద్యనభ్యసించిన ఆయన నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ విముక్తి పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో ఆసిఫాబాద్ నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. 1967, 1972లో భువనగిరి నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. 1957-60 వరకు రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా, ముఖ్యమంత్రి సంజీవయ్య క్యాబినేట్‌లో ఎక్సైజ్, చేనేత, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. అనంతరం ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి క్యాబినేట్‌లో కార్మిక, సమాచార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 1969 తెలంగాణ తొలిదశ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.



వాంకిడి వీధుల్లో ప్రజలతో బాపూజీ (పాత చిత్రం)

మలిదశలో ఉద్యమంలో..

2000లో మలి దశ ఉద్యమం ప్రారంభించిన కేసీఆర్‌తో మాట్లాడి ప్రోత్సహించడమే కాదు. సచివాలయం ఎదురుగా ఉన్న తన నివాసం జలదృశ్యాన్ని తెరాస ప్రధాన కార్యాలయానికి ఇచ్చారు. ఆ వేదికగానే తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస) ఆవిర్భవించింది. అప్పటి నుంచి బాపూజీ అశోక్‌నగర్‌లోని అద్దె ఇంట్లో నివాసమున్నారు. తెలంగాణ సమరయోధులతో ఇందిరాపార్కు వద్ద, ఆ తర్వాత దిల్లీలోని జంతర్‌మంతర్‌లో సత్యాగ్రహం చేయడం ఆయన పోరాట స్ఫూర్తికి నిదర్శనం. ఎర్రటి ఎండలో తెలంగాణ రాష్ట్రమంతటా బస్సు యాత్ర చేపట్టారు. తెలంగాణ ఇవ్వకపోతే సమాంతర ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని తేల్చిచెప్పారు. 97ఏళ్ల వయసులో 2012 సెప్టెంబరు 21న ఆయన కన్నుమూశారు.

జన్మభూమి కోసం..

తాను పుట్టిన జన్మభూమి రుణం తీర్చుకునేందుకు 2010లో వాంకిడిలో 'లక్ష్మణ సేవాసదన్' స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. దీని ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అత్యవసర వైద్య సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేశారు. మహిళలకు కుట్టుశిక్షణ, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వాంకిడి మండల కేంద్రంలో తల్లిదండ్రుల స్మారకార్థం రెండు ముఖ ద్వారాలను నిర్మించారు.

ఇంధన్‌పల్లి రేంజిలో పెద్దపులి పాదముద్రల కలకలం

జన్నారం, న్యూస్‌టుడే: కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం పరిధి జన్నారం అటవీ డివిజన్ ఇంధన్‌పల్లి రేంజిలో పెద్దపులి పాదముద్రలు కలకలం రేపాయి. గురువారం చేపల వేటకు వెళ్లిన కొందరు ఆదివాసీ యువకులకు పులి పాదముద్రలు కనిపించడంతో చరవాణిలో ఈ చిత్రాలను బంధించారు. ఈ విషయమై ఇంధన్‌పల్లి రేంజి అధికారి హఫీసొద్దీన్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పెద్దపులి సంచరిస్తోన్న మాట వాస్తవమేనని పశువులకాపరులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అయితే అటవీ ప్రాంతంలో అమర్చిన కెమెరాకు పులి చిక్కకపోవడంతో సందిగ్ధం నెలకొంది. అటవీ డివిజన్‌లోని కొన్ని బీట్లలో పెద్దపులి సంచరిస్తోందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ ఇటీవల దండోరా సైతం వేయించింది.



బురదలో కనిపిస్తున్న పులి పాదముద్ర

జైనథ్ ఆలయంలో మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ పూజలు



పూజలు చేస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద

జైనథ్, న్యూస్‌టుడే : జైనథ్ శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. మహిళలు, నాయకులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన ఆమె తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ, కంది మౌనారెడ్డి, కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గజేందర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అశోక్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల పరుగు.. మారథాన్ వైపు

● అధికారుల నుంచి కానిస్టేబుల్ వరకు ఆసక్తి

పరుగెత్తడం సులభమేమి కాదు.. చాలా మంది ఒకటి, రెండు కిలోమీటర్లు పరుగు పెట్టేందుకు ఆయాస పడుతుంటారు. అలాంటిది ఏకంగా 21(హాఫ్ మారథాన్), 42(మారథాన్) కిలోమీటర్లు నిర్విరామంగా పరుగెత్తడమంటే నిరంతర సాధన, పట్టుదలతో సాధ్యమవుతోంది. ఇలాంటి పరుగును అవలీలగా పూర్తి చేస్తున్నారు రామగుండం కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న పోలీసులు. ఒకరిని చూసి మరొకరు స్ఫూర్తి పొందుతూ అధికారి స్థాయి నుంచి కానిస్టేబుల్ వరకు పాల్గొంటూ మరింత మందికి ఆసక్తి పెంచుతున్నారు.

- న్యూస్‌టుడే, మంచిర్యాల క్రీడావిభాగం

ఎందరికో స్ఫూర్తి




రామగుండం కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐగా పనిచేస్తున్న కటికె రవిప్రసాద్ అందరికీ మారథాన్ రుచి చూపిస్తున్నారు. ఈయన ఇప్పటికే రెండు మారథన్‌లు, పదికిపైగా హాఫ్ మారథాన్‌లు పూర్తి చేసుకున్నారు. మొదట ఒక్కడిగా మొదలుపెట్టి ప్రస్తుతం పదుల సంఖ్యలో తోటి ఉద్యోగులతోపాటు స్నేహితులకు వ్యాప్తి చేశారు. రాష్ట్రంలో కాకుండా ముంబయి, గోవా తదితర ప్రాంతాల్లో నిర్వహించిన మారథాన్‌కు హాజరయ్యారు. ఈ పరుగుతో మరికొంతమందికి స్ఫూర్తినిస్తూ తను ఆరోగ్యంగా ఉండటమే కాకుండా ఇతరులను వ్యాయామంపై ఆసక్తి పెంచుకునేలా చేస్తున్నారు.



ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన హాఫ్ మారథాన్‌లో ఔత్సాహికులు

హాఫ్ మారథాన్ అవలీలగా..



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సీఐగా పని చేస్తున్న గడిగొప్పుల సతీష్ హాఫ్ మారథాన్‌ను అవలీలగా చేసేస్తుంటారు. ఇటీవల తన మొదటి మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈయన 21 కిలోమీటర్లను మంచినీళ్లు తాగినంత సులువుగా పురుగెడతారు. దాదాపు 90-100 నిమిషాల వ్యవధిలో పూర్తి చేస్తారంటే ఏ స్థాయి వేగం ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఏడాదిన్నర సాధనలో పదులకొద్ది హాఫ్ మారథాన్‌లో పాల్గొన్నారు. ఇంకా వేగాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు.

నెమ్మదిగా ప్రారంభించి..




జిల్లా కేంద్రంలో ఇంటెలిజెన్స్ విభాగం ఎస్సైగా పనిచేస్తున్న రవికుమార్ ఏడాది కిందటి వరకు అయిదు కిలోమీటర్లే కష్టంగా పరుగెత్తేవారు. తోటి ఉద్యోగి స్ఫూర్తితో ఆఫ్ మారథన్‌లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. గతేడాది సిద్దిపేటలో నిర్వహించిన మొదటి మారథన్‌లో భాగస్వాములయ్యారు. ఇది కాస్త ఇబ్బందిగా పూర్తి చేయగా ఆ తర్వాత హైదరాబాద్, కరీంనగర్‌లో జరిగిన మారథన్ అవలీలగా పూర్తి చేశారు. ప్రస్తుతం రెండు గంటల్లో 21 కిలోమీటర్లు పరుగెత్తుతుండగా మారథన్‌లోనూ భాగస్వామి అయ్యేందుకు సన్నద్ధమవుతున్నారు.

నాలుగైదు నెలల్లోనే..



రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎస్‌బీ విభాగంలో ఎస్సైగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్ తన మొదటి హాఫ్ మారథాన్‌ను విజయవంతంగా పూర్తిచేశారు. ఇది వరకు 5, 6 కిలోమీటర్లకే పరిమితమయ్యేవారు. తోటి ఉద్యోగులు, మిత్రుల స్ఫూర్తి, ప్రోత్సాహంతో హాఫ్ మారథాన్‌వైపు అడుగులు వేశారు. కేవలం నాలుగైదు నెలల సాధనతో అవలీలగా పరుగుపెడుతున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా రెండు గంటల వ్యవధిలో పూర్తి చేస్తుండగా మరింత వేగం పెంచేందుకు సాధన చేస్తున్నారు.

ఏడాది నుంచి..



జిల్లాలోని భీమారం పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న బేతి రాములు ఏడాది నుంచి పరుగుపై దృష్టి పెట్టారు. హాఫ్ మారథాన్‌లో పాల్గొనాలనే ఆసక్తితో నిత్యం సాధన చేయడం ప్రారంభించారు. మొదట 5, 10, 15 ఇలా వడివడిగా కిలోమీటర్ల సంఖ్యను పెంచుకుంటూ ప్రస్తుతం 21 కిలోమీటర్లను అవలీలగా పరుగెత్తుతున్నారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తన తొలి హాఫ్ మారథాన్‌న్ విజయవంతంగా రెండు గంటల్లో పూర్తి చేసుకున్నారు. 42 కిలో మీటర్లను సైతం ఇదేతీరుతో పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఫిట్‌నెస్ విషయంలో జాగ్రత్తలతో..





వీరిద్దరు రామగుండం కమిషనరేట్‌లో పరిధిలోని ఇంటెలిజెన్స్, టాస్క్‌ఫోర్స్ విభాగాల్లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు మాదాసి మధుకర్, రెడ్డిరాజుల తిరుపతి. ఫిట్‌నెస్ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటుంటారు. క్రమం తగ్గకుండా మైదానాన్ని వెళ్తుంటారు. పరుగు సాధన, అప్పుడప్పుడు ట్రెక్కింగ్ సైతం చేస్తుంటారు. తమ శాఖలోని అధికారులను స్ఫూర్తిగా తీసుకుని కొంతకాలంగా హాఫ్ మారథాన్‌కు సిద్ధమయ్యారు. కరీంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి మొదటిసారి హాజరై సునాయసంగా పూర్తిచేశారు. సాధనను కొనసాగిస్తూ మారథాన్‌కు సన్నద్ధమవుతామంటున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369
(10 AM TO 1 PM)

భీమారం, న్యూస్‌టుడే:

? కాజీపల్లి గ్రామంలోని కురుమవాడలో బోరు మోటారు చెడిపోయి మూడు రోజులుగా తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. **- రాజన్న, కాజీపల్లివాసి**

✔ ఈ సమస్య మా దృష్టికి వచ్చింది. మెకానిక్ అందుబాటులో లేక పోవడంతో ఆలస్యం అయింది. రెండు రోజులలో సమస్యను పరిష్కరిస్తాం. **- రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి, కాజీపల్లి**

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే:

? బెల్లంపల్లిలోని రవీంద్రనగర్ రోడ్డు అధ్వానంగా మారింది. గుంతలుగా మారడంతో ఇబ్బందులు పడుతున్నాం. **-రమేష్, రవీంద్రనగర్**

✔ రవీంద్రనగర్ రోడ్డుకు రూ.90 లక్షల నిధులు మంజూరయ్యాయి. త్వరలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. **- సందీప్, ఏఈ, మున్సిపాలిటీ**

న్యూస్‌టుడే, జైపూర్

? ఇందారం గ్రామం 2వ వార్డులోని గౌడ్స్ కాలనీలో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. సుమారు 20 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన స్తంభాలతో తీగలు ఇళ్ల మీదకు వస్తుండటంతో ఏ నిమిషం ఏం జరుగుతుందో అనే ఆందోళనతో ఉన్నాం. **- 2 వార్డు ప్రజలు, ఇందారం.**

✔ క్షేత్రస్థాయిలో సిబ్బందిని పంపి అక్కడి పరిస్థితుల ఆధారంగా చర్యలు తీసుకుంటాం. **- విద్యుత్తు ఏఈ మనోహర్, జైపూర్**

? **మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే:**

పాత మంచిర్యాలలోని హనుమాన్ నగర్‌లో ఇంటి నెం.17-245 వద్ద వీధి దీపం వెలుగడం లేదు. అక్కడ రాత్రి చీకటితో రహదారిపైకి రావడానికి ఇబ్బందిగా ఉంది. **- తడికొప్పుల లక్ష్మణ్, పాతమంచిర్యాల**

✔ రెండు రోజుల్లో అక్కడ కరెంటు స్తంభానికి వీధి దీపం ఏర్పాటు చేయిస్తాం. **- మసూద్ అలీ, మున్సిపల్ ఇంజినీరు, మంచిర్యాల**

పాతకక్షలే దాడులకు ప్రధాన కారణం: ఏసీపీ

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో ఈ నెల 23న అర్ధరాత్రి స్థానిక కాంగ్రెస్ నాయకుడు జగన్‌మోహన్‌రావు ఇంటి ఆవరణలో జరిగిన రెండు వర్గాల దాడులకు పాతకక్షలే ప్రధాన కారణమని మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ తెలిపారు. గురువారం రాత్రి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. భారాస నాయకుడు గడప రాకేష్ కొద్దికాలంగా వ్యక్తిగత ఆధిపత్యం కోసం తన అనుచరుతో కలిసి స్థానికంగా పలు వివాదాస్పద గొడవల్లో తలదూర్చాడు. గత సంవత్సరం సెప్టెంబరులో రాకేష్‌కు సంబంధించిన అనుచరులు జగన్‌మోహన్‌రావు ఇంటి వద్దకు వెళ్లి మేర సంజీవ్‌తోపాటు పలువురిపై దాడికి పాల్పడ్డారు. అనంతరం జూన్ 2న రాకేష్‌పై సంజీవ్‌తోపాటు ఆయన అనుచరులు తీవ్రంగా దాడి చేసి గాయపరిచారు. అప్పటి నుంచి జీర్ణించుకోలేని రాకేష్ గ్యాంగ్ ఎలాగైనా తమ ఉనికిని చాటుకోవాలనుకున్నారు. అదే క్రమంలో ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న రాకేష్ తన అనుచరులతో పలుమార్లు ఫోన్‌లలో మాట్లాడుతూ ఉన్నాడు. స్థానిక గద్దె రాగడి వద్ద దాడి ఎలా చేయాలనేది ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 23న అర్ధరాత్రి పోచంపల్లి సంపత్, కుంట శ్రీధర్, నగేష్, అబ్దుల్ రసూల్, ఎండీ అన్వర్‌పాషా, పున్నం, విశాల్, పంగ శ్రీధర్, ఉడత అజయ్, మామిళ్ల సేతు, మేకనపెల్లి శశిధర్, జ్ఞానేశ్వర్, రుద్రతేజ, అన్నమయ్య, కుర్మ ప్రవీణ్, చంటి, సలీంతోపాటు పలువురు జగన్‌మోహన్‌రావు ఇంటిలో చొరబడి సంజీవ్‌తోపాటు అఫ్రోజ్, వాచ్‌మెన్ శంకరయ్యలపై దాడి చేశారు. ప్రతిఘటనలో జ్ఞానేశ్వర్, రుద్రతేజలకు తీవ్రగాయాలవడంతో మిగతా వారు అక్కడి నుంచి పారిపోయారు. గురువారం సాయంత్రం దాడులకు పాల్పడిన వారిలో కుంట శ్రీధర్, నగేష్, అబ్దుల్ రసూల్, ఎండీ అన్వర్‌పాషా, పున్నంలను మంచిర్యాల రైల్వేస్టేషన్ నుంచి హైదరాబాద్‌కు పారిపోతుండగా అదుపులోకి తీసుకున్నామని ఏసీపీ తెలిపారు. కేసులో నిందితులైన రాకేష్‌పై ఆరు, సంపత్‌పై హత్యతోపాటు ఏడు కేసులు, ఇతరులపై కేసులు ఉన్నాయన్నారు. రెండు కేసుల కంటే ఎక్కువ ఉన్నవారిపై త్వరలో రౌడీషీట్ నమోదు చేస్తామన్నారు. ప్రస్తుతం రాకేష్‌తోపాటు పరారీలో ఉన్న నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు. సీఐ బన్సీలాల్, ఎస్సైలు పాల్గొన్నారు. నిందితుల్లో రుద్రతేజ, జ్ఞానేశ్వర్‌లు తీవ్రంగా గాయపడి ప్రాణపాయస్థితిలో ఉండగా వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుకు ఇప్పటికి పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయలేదు. దాడి జరిగిన ఘటన వద్ద నిఘా నేత్రాలు ఉన్నప్పటికీ, దాడికి ఉపయోగించిన పరికరాలను పోలీసులు మీడియా ముందు చూపించకపోవడం గమనార్హం.

అంకితభావంతో పని చేయాలి



లక్షెట్టిపేటలో దస్త్రాలు పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే: ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి మన్ననలు పొందేలా విధులు నిర్వర్తించాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ పోలీసులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. దస్త్రాల నిర్వహణను సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. అంకితభావంతో పని చేసే వారికి నెలవారీగా రివార్డులు ఇవ్వనున్నట్టు వెల్లడించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. డీసీపీ ఎ.భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, సీఐ ఎ.నరేందర్, ఎస్సై సతీష్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ

దండేపల్లి గ్రామీణం: కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు సోదరీమణులు రుక్మిణీ, సత్యశ్రీ మహిళలకు బతుకమ్మ చీరలను గురువారం పంపిణీ చేశారు. మండల కేంద్రంతోపాటు రెబ్బన్‌పల్లి, చింతపల్లి, తానిమడుగు, నెల్కివెంకటాపూర్, నర్సాపూర్, కర్ణపేట గ్రామాల్లో వీటిని అందించారు.



మందమర్రిలో చాకలి ఐలమ్మకు నివాళులు అర్పిస్తున్న రజక సంఘం సభ్యులు



ఆర్కేపీలో..



దండేపల్లిలో..

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతిని గురువారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె పోరాటం స్ఫూర్తిదాయకం అన్నారు. మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, కౌన్సిలర్ మజీద్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు కటుకూరి రాజన్న, టీజీఎస్పీ 13వ పటాలంలో కమాండెంట్ వెంకటరాములు, తదితరులు ఉన్నారు. - న్యూస్‌టుడే, బృందం



మంచిర్యాలలో.. మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య



చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద కమాండెంట్ వెంకటరాములు



రజక రిజర్వేషన్ సమితి ఆధ్వర్యంలో..

అసైన్డ్ భూముల్లోని నిర్మాణదారులకు నోటీసుల జారీ

చెన్నూరు, న్యూస్‌టుడే: చెన్నూరు పట్టణంలోని సర్వే నెంబరు 840లోని ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న నిర్మాణదారులకు గురువారం పురపాలకశాఖ అధికారుల మళ్లీ నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ స్థలంలో ఎలా నిర్మాణాలు చేపట్టారో, ఇంటి నెంబర్లు ఎలా తీసుకున్నారో తెలపాలంటూ ఇటీవల నిర్మాణదారుల నుంచి వివరణ కోరిన విషయం తెలిసిందే. వారిచ్చిన ఆధారాలను పరిశీలించి సరైన ధ్రువపత్రాలు సమర్పించలేదని ఆన్‌లైన్ రికార్డుల నుంచి ఇంటి నెంబర్లు తొలగించారు. ఇదిలా ఉంటే ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు ఇంటి నెంబర్లు తొలగించడంపై నిర్మాణదారులు కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. ఈ మేరకు పురపాలక అధికారులు సంజాయిషీ ఇచ్చేందుకు కోర్టుకు సైతం హాజరైనట్లు తెలిసింది. సదరు సర్వే నెంబరులోని 34 మంది నిర్మాదారులకు విచారణ నిమిత్తం శుక్రవారం ఉదయం 11 గంటలకు పురపాలక సంఘ కార్యాలయానికి హాజరు కావాలంటూ తాజాగా పురపాలకశాఖ అధికారులు మళ్లీ నోటీసులు జారీ చేశారు. దీంతో తదుపరి ఎలాంటి చర్యలకు ఉపక్రమిస్తారోనని నిర్మాణదారులు ఆందోళనకు గురవుతున్నారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

జైపూర్, న్యూస్‌టుడే : గ్రామాల్లో లోటుపాట్లు లేకుండా నీటి సరఫరా చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణ తరగుతులను పంచాయతీ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం జరిగిన శిక్షణ తరగతులను పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, ఎంపీవో బాపు, ఏఈఈ మనోజ్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు

నిధుల దుర్వినియోగంతో సంస్థకు నష్టం

శ్రీరాంపూర్ గ్రామీణం: నిధుల దుర్వినియోగంతో సంస్థలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తే ప్రమాదముందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు పేర్కొన్నారు. గురువారం రవీంద్రఖని-7 గని వద్ద మాట్లాడుతూ సంస్థ నిధులను కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలన్నారు.

'ఉద్యోగులను రెచ్చగొడుతున్నారు'

మందమర్రి పట్టణం: లాభాల వాటా చెల్లింపుపై కొన్ని సంఘాల నాయకులు వెనకాల ఉండి ఉద్యోగులను రెచ్చగొడుతున్నారని ఏఐటీయూసీ కేంద్ర కమిటీ కార్యదర్శి అక్బర్‌అలీ, బ్రాంచి కార్యదర్శులు సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్ విమర్శించారు. గురువారం మందమర్రి సంఘం కార్యాలయంలో మూడు బ్రాంచీల కార్మికులతో సమావేశం నిర్వహించారు. పలువురు సంఘంలో చేరగా వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సుదర్శన్, శ్రీనివాస్, రాజేశం, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

వాస్తవ లాభాల వాటా చెల్లించాలి

మందమర్రి పట్టణం: వాస్తవ లాభాల



కేకే5 గనిపై సంతకాల సేకరణ చేపట్టిన తెబొగకాసం నాయకులు

నుంచే కార్మికులకు వాటా చెల్లించాలంటూ గురువారం మందమర్రి కేకే5 గనిపై తెబొగకాసం సీనియర్ నాయకుడు జె.రవిందర్ ఆధ్వర్యంతో కార్మికులు సంతకాల సేకరణ చేపట్టారు. గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణి గడించిన లాభాలు రూ.4701 కోట్ల నుంచే 33 శాతం వాటా రూ.1551 కోట్లు కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు.

నస్పూర్ : 2023- 24 ఆర్థిక సంవత్సరంలో కార్మికులకు లాభాల వాటా పంపిణీలో అన్యాయం జరిగిందని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు పేర్కొన్నారు. గురువారం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు శ్రీనివాస్, బాలాజీ, చంద్రశేఖర్, నరహరి పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ గ్రామీణం: సింగరేణిలో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం జీఎం బి.సంజీవరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఆ సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎంపీఎఫ్‌లో జరిగిన రూ.1000 కోట్ల కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గతేడాది సంస్థ సాధించిన వాస్తవ లాభాల్లో 33 శాతం రూ.1551.33 కోట్లు కార్మికులకు చెల్లించాలని కోరారు.

సీఎంపీఎఫ్ చీటీల పంపిణీ

మందమర్రి పట్టణం: మందమర్రి జీఎం కార్యాలయంలో ఉద్యోగులకు గురువారం జీఎం దేవేందర్ సీఎంపీఎఫ్ చీటీలను పంపిణీ చేశారు. సంస్థ చేపట్టే అన్ని పనులు, తీసుకునే నిర్ణయాలు పారదర్శకంగా ఉంటాయన్నారు. ఎస్వోటూజీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీవైపీఎం ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుదోవ పట్టించేలా విధానాలు

శ్రీరాంపూర్ గ్రామీణం: కార్మికులను తప్పుదోవ పట్టించేలా తెబొగకాసం ప్రయత్నిస్తుందని సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు జె.శంకర్‌రావు పేర్కొన్నారు. బాయిబాటలో భాగంగా గురువారం రవీంద్రఖని-6 గనిని సందర్శించిన నాయకులు కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. లాభాల్లో వాటా చెల్లింపుపై ఇతర సంఘాలు చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదన్నారు. గనిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గని మేనేజర్ ఇ.తిరుపతికి వినతిపత్రం సమర్పించారు.

నస్పూర్ : లాభాల వాటాపై కొన్ని యూనియన్‌లు అసత్య ప్రచారం చేస్తున్నారని గుర్తింపు సంఘం అధ్యక్షుడు సీతారామయ్య పేర్కొన్నారు. గురువారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో మాట్లాడారు.

అధికారుల శ్రమదానం

హాజీపూర్ : మండలంలోని ముల్కల్ల పంచాయతీల్లో స్వచ్ఛతాహీ సేవ పనులను గురువారం డివిజనల్ పంచాయతీ అధికారి ధర్మారాణి ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలో చేస్తున్న పనులపై ఆరా తీశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ గ్రామీణం: సింగరేణి ఉద్యోగులు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీజీఎం(పీ) అరవిందరావు పేర్కొన్నారు. గురువారం ఏరియా స్టోర్స్‌లో ఉద్యోగులతో కలిసి చెత్త, వ్యర్థాలను తొలగించారు.

మందమర్రి పట్టణం, జన్నారం : అందుగులపేట, మామిడిగట్టు, సారంగపల్లి గ్రామాల్లో ఎంపీడీవో రాజేశ్వర్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. జన్నారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని పిచ్చి మొక్కలను ఎంపీడీఓ శశికళ, కార్యాలయ సిబ్బంది కలిసి గురువారం తొలగించారు.



విద్యార్థులకు అందించిన క్రీడా దుస్తులతో మల్హాల్‌రావు, రవీందర్‌రావు

ఎదుటి వారి కళ్లలో ఆనందం చూడటమే ముఖ్యం

జన్నారం, న్యూస్‌టుడే: ఎదుటి వారి కళ్లలో ఆనందం చూడటమే ముఖ్యమని విశ్రాంత డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ చెప్యాల మల్హాల్‌రావు అన్నారు. చింతగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 152 మంది విద్యార్థులకు రూ.75,500 వెచ్చించి కొనుగోలు చేసిన క్రీడా దుస్తులను గురువారం అందజేశారు. మల్హాల్‌రావు మాట్లాడుతూ తాను పుట్టిన గ్రామంలోని విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పాఠశాలలోని లైబ్రరీ కోసం మరో 500 పుస్తకాలు అందజేయనున్నట్లు చెప్పారు. అతడి అన్నయ్య కుమారుడు చెప్యాల రవీందర్‌రావు మాట్లాడుతూ పాఠశాలకు ఎలాంటి అవసరాలున్నా తీరుస్తానని హామీ ఇచ్చారు.

నేర వార్తలు

డివైడర్‌ను ఢీకొని వృద్ధుడి మృతి

నస్పూర్, న్యూస్‌టుడే: శిరస్త్రాణం ధరించకపోవడంతో ఓ నిండు ప్రాణం గాలిలో కలిసిపోయింది. నస్పూర్ జాతీయ రహదారి తోళ్ల వాగు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. ఎస్సై సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల రెడ్డికాలనీకి చెందిన పోరెడ్డి లక్ష్మారెడ్డి(67) సింగరేణి విశ్రాంత కార్మికుడు. ప్రస్తుతం లారీ యజమాని పని నిమిత్తం గురువారం నస్పూర్‌లోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వచ్చాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో సాయంత్రం జాతీయ రహదారి తోళ్లవాగు సమీపంలో ద్విచక్రవాహనం అకస్మాత్తుగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనం జాతీయ రహదారిపై పడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

హాజీపూర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం ఓ లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన వాంకిడి మండలం ఖిలాడీగూడకు చెందిన కోవ శేఖ్(38) మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. హాజీపూర్ పోలీసుల కథనం ప్రకారం వాంకిడి మండలం వెలిగి గ్రామానికి చెందిన ఆత్రం జ్యోతిరావు, కోవ శేఖ్‌లు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వాంకిడి నుంచి ద్విచక్రవాహనంపై కొండగట్టుకు వెళ్తున్న క్రమంలో హాజీపూర్ మండల కేంద్రంలో ఎదురుగా లక్షెట్టిపేట నుంచి మంచిర్యాల వైపునకు కంకర లోడుతో వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జ్యోతిరావు అక్కడికక్కడే మృతి చెందిన విషయం విధితమే. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన కోవ శేఖ్‌ను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య సీతాబాయి ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాగులో నీట మునిగి ఒకరు..

భీమిని, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి వాగులో నీట మునిగి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్ కుమార్ వివరాల ప్రకారం భీమినికి చెందిన కల్యాణం మల్లేష్(45) క్షవరం వృత్తి చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. మండలంలోని మామిడిగూడకు మృతుడు బుధవారం సాయంత్రం క్షవరం చేయడానికి వెళ్లాడు. పని ముగించుకొని మద్యం తాగి ఇంటికి వస్తున్న క్రమంలో భీమిని, మామిడిగూడ గ్రామాల మధ్యలోని ఎర్రవాగు దాటే క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయాడు. వాగులో తుంగ గడ్డి ఉండటంతో మద్యం మత్తులో అందులో చిక్కుకొని మృతి చెందాడు. మల్లేష్ ఇంటికి తిరిగి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు వెతకగా ఎర్రవాగులో గురువారం శవం లభ్యమైంది. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పాముకాటుతో వాచ్‌మెన్..

మంచిర్యాలనేరవిభాగం: మంచిర్యాల గోదావరి రైల్వే వంతెన వద్ద గురువారం తెల్లవారుజామున పాముకాటుతో ఒకరు మృత్యువాత పడినట్లు జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం గ్రామానికి చెందిన ఆకారపు సత్యనారాయణ(55) మంచిర్యాలలోని గోదావరి వంతెన వద్ద జరుగుతున్న పనులకు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరి బుధవారం రాత్రి పని స్థలం వద్ద నిద్రిస్తున్న క్రమంలో పాముకాటు వేయడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గురువారం ఉదయం స్థానికులు ఆయనను గుర్తించి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య భారతి, కూతురు సుస్మితలు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి స్థావరంపై దాడి

బెల్లంపల్లి పట్టణం, నెన్నెల, న్యూస్‌టుడే: గంజాయి తాగుతున్న పలువురిని అరెస్టు చేసిన ఘటన నెన్నెల మండల పరిధిలో గురువారం చోటు చేసుకుంది. బెల్లంపల్లి పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ రవి కుమార్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గురువారం నెన్నెల శివారులోని చెరువు దగ్గర గంజాయి తాగుతున్నారనే సమాచారం మేరకు ఎస్సై ప్రసాద్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. మహ్మద్ ముస్తఫా, ఆకాశ్, వినోద్, సుందర్, స్వామి, శేఖర్, దేవేందర్, రమాకాంత్, జమీల్‌లు గంజాయి తాగుతూ పట్టుబడ్డారు. మహ్మద్ ముస్తఫా దగ్గర 169 గ్రాముల గంజాయి పట్టుబడగా, మిగతా వారి నుంచి 6 చరవాణిలు, 4 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని వీరిపై కేసులు నమోదు చేశారు.

కండక్టరుపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

భీమారం, న్యూస్‌టుడే: విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ బస్సు కండక్టరుపై దాడి చేయడమే కాకుండా తన విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి పై కేసు నమోదు చేసినట్టు భీమారం ఎస్సై బి.రాములు తెలిపారు. బుధవారం రాత్రి మంచిర్యాల డిపోనకు చెందిన బస్సు సిరోంచ నుంచి మంచిర్యాలకు చివరి ట్రిప్పుగా వెళ్తుండగా చెన్నూరులో ముగ్గురు వ్యక్తులు ఎక్కారు. బస్సులో ప్రయాణిస్తుండగా వారిలో వారు గొడవపడుతూ ఇతర ప్రయాణికులకు ఇబ్బంది కలిగించారు. ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని నచ్చజెప్పే ప్రయత్నం చేసినందుకు వేమనపల్లికి చెందిన సిడం మహేష్ అనే వ్యక్తి బస్సు కండక్టర్ గొలె భాస్కర్‌పై దాడికి పాల్పడ్డాడు. బస్సులోని అందరిని తిడుతూ, డ్రైవర్‌పై దాడికి యత్నించినట్టు తెలిపారు. దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఎనిమిది గొర్రెలను చంపిన తోడేలు

నెన్నెల, న్యూస్‌టుడే: మండలంలోని కోనంపేట అటవీ శివారు ప్రాంతంలో గొర్రెల మందపై తోడేలు దాడి చేయడంతో 8 గొర్రెలు మృతి చెందినట్లు గొర్రెలకాపరి రాజం తెలిపారు. గొర్రెలను సంరక్షించడానికి ప్రయత్నం చేయగా తనపై దాడి చేయడానికి యత్నించగా ప్రాణం దక్కించుకున్నట్లు వివరించారు. వీటి విలువ రూ.30,000 ఉంటుందని చెప్పారు. అటవీ శాఖాధికారులు తమకు పరిహారం చెల్లించాలని కోరారు.

సంక్షిప్తం

ప్రజల భద్రతకే తనిఖీలు

బెల్లంపల్లి గ్రామీణం: గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్బంధ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీఐ అఫ్జలోద్దీన్ అన్నారు. గురువారం పెద్దబూదలో పలు దుకాణాల్లో నిల్వ చేసిన రూ.9,550 విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సరైన ధ్రువపత్రాలు లేని 38 వాహనాలకు జరిమానా విధించినట్లు తెలిపారు. ఎస్సైలు రమేష్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక నిల్వ

నెన్నెల, న్యూస్‌టుడే: మండలంలోని మైలారం గ్రామంలో ప్రాణహిత చేవేళ్ల కాలువ క్యాంప్ వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను రెవెన్యూ అధికారులు, పోలీసులు గురువారం పరిశీలించారు. స్థానిక వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా క్యాంపు వరకు తరలించి అక్కడి నుంచి అక్రమంగా పట్టణాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించగా ఇసుక నిల్వలు ఉన్నాయన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ రమేష్‌ను వివరణ కోరగా ఆర్ఐ సులోచన వెళ్లి పరిశీలించారన్నారు. శుక్రవారం మైనింగ్ అధికారులతో వెళ్లి సీజ్ చేస్తామని తెలిపారు.



మైలారంలో నిల్వ చేసిన ఇసుక

కొండచిలువ కలకలం

మందమర్రి పట్టణం: మందమర్రి శ్రీకృష్ణ గార్డెన్ పక్కన శీతలపానియాల గోదాం వద్ద కొండచిలువ కలకలం రేపింది. కొండచిలువను చూసి భయపడిన స్థానికులు స్నేక్ సొసైటీ సభ్యులకు సమాచారం అందించారు. దాన్ని పట్టుకుని సమీప అటవీ ప్రాంతంలో వదిలేశారు.

చట్టాలపై అవగాహన అవసరం

భీమారం: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన అవసరమని మండల న్యాయాధికార సంస్థ ఛైర్మన్, చెన్నూరు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి రవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన వేదిక కార్యక్రమంలో నూతన చట్టాలు-మహిళల రక్షణ వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.


పాఠశాలకు అవార్డు

తాండూరు: మండలంలోని విద్యాభారతి పాఠశాలకు డైనమిక్ స్కూల్ 2024 అవార్డు వచ్చినట్లు ఆ పాఠశాల డైరెక్టర్ సురభి శరత్‌కుమార్ తెలిపారు. ఎడ్యుకేషన్ టుడే ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నామన్నారు.

ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయొద్దు

జైపూర్: రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయవద్దని తపస్ జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం మండలంలోని ముదిగుంట జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు రెండు ఏండ్లుగా జీపీఎఫ్, టీఎస్‌బీఎల్ఐ రుణాలు, సంపాదిత సెలవులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులకు తపస్ సభ్యత్వాలు అందజేశారు.

ఐఎంఏ అధ్యక్షుడిగా రమణ



మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) మంచిర్యాల శాఖ నూతన కమిటీ నియామకమైంది. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో 2024-25 సంవత్సరానికి ఆయా కమిటీ సభ్యులను ప్రకటించింది. అధ్యక్షుడిగా రమణ, కార్యదర్శి విశ్వేశ్వరరావు, కోశాధికారి స్వరూపరాణి, ఉపాధ్యక్షులుగా పద్మ, ఎన్.శ్రీనివాస్, నవీన్, కళావతి, సంయుక్త కార్యదర్శులు జ్యోతి, సురేష్‌కుమార్, కుమార్ గౌడ్, టి.శ్రీలత, రాకేష్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులను నియమించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి కస్తూర్బా ఆశ్రమ పాఠశాలను గురువారం జడ్పీ సీఈఓ గణపతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం తయారీ తీరును పరిశీలించారు. నాణ్యమైన భోజనం తయారు చేసి విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. అనంతరం నీల్వాయి, కళ్లంపల్లి గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు పరిశీలించి తగు సూచనలిచ్చారు. వేమనపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని ఆదేశించారు.

బెల్లంపల్లిలో లాన్ టెన్నిస్ పోటీలు

బెల్లంపల్లి పట్టణం: పట్టణంలోని టీసీఓఏ క్లబ్‌లో లాన్ టెన్నిస్ క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలను సింగరేణి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రాధాకృష్ణ ప్రారంభించారు. కోలిండియా స్థాయిలో సింగరేణి క్రీడాకారులు ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. గతంలో కోలిండియాలో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు.

హుండీ ఆదాయం రూ.3,52,361

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని విశ్వనాథాలయానికి చెందిన తొమ్మిది హుండీలను గురువారం లెక్కించగా రూ.3,52,361 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ముక్త రవి తెలిపారు. ఆరు నెలలకు సంబంధించి భక్తుల కానుకలను లెక్కించినట్లు పేర్కొన్నారు.

ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలని వినతి

బెల్లంపల్లి పట్టణం: బెల్లంపల్లి ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపల్ స్వరూపను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. ప్రిన్సిపల్ విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. పరుష పదజాలంతో విద్యార్థినులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆరోపించారు.